


రూ.1,00,116 విరాళం
సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహుని నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.50,116, నిత్యాభిషేకానికి రూ.50 వేల చొప్పున ఆకుల త్రిమూర్తులు (అమలాపురం) విరాళం అందజేశారు.

సత్యదేవునికి ముత్యాల హారం


అన్నవరం: సత్యదేవునికి రూ.2 లక్షల విలువైన 20 గ్రాముల బంగారం, 29 గ్రాముల ముత్యాలతో చేయించిన హారాన్ని టి.అనిల్ కుమార్ (హైదరాబాద్) సమర్పించారు.

మిగులు జలాల విడుదల


ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం 44,537 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 800, మధ్య డెల్టాకు వెయ్యి, పశ్చిమ డెల్టాకు 3,500 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.50 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

డబ్బుకు అమ్ముడుపోయిన ఎమ్మెల్సీ
పద్మశ్రీపై మండిపడ్డ ద్వారంపూడి

కాకినాడ: ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ డబ్బుకు అమ్ముడుపోయి, రాజీనామా చేశారని మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మండిపడ్డారు. ఆమె తీరు అతి పెద్ద వెన్నుపోటు అని అభివర్ణించారు. ఎమ్మెల్సీ పద్మశ్రీ, ఆమె భర్త కర్రి నారాయణరావు వ్యవహార శైలిపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో ఎంతో మంది పార్టీలు మారుతూ ఉంటారని, అయితే కర్రి పద్మశ్రీ వ్యవహార శైలి మాత్రం అత్యంత దారుణమని అన్నారు. సాధారణ వ్యక్తిని గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీని చేస్తే, చివరకు డబ్బుకు ఆశపడి రాజీనామా చేశారని మండిపడ్డారు. ఆమెకు పార్టీ న్యాయం చేసిందే తప్ప అన్యాయం చేయలేదన్నారు. రాజీనామా చేశానంటూనే అధికారిక కార్యక్రమాలకు హాజరు కావడం, గన్‌మెన్‌లను వెంట పెట్టుకుని తిరగడాన్ని ద్వారంపూడి తప్పుపట్టారు. సమైక్యాంధ్ర ఉద్యమంలో తాను, వంగా గీత, కురసాల కన్నబాబు కూడా రాజీనామాలు చేసి, గన్‌మెన్‌లను విడిచిపెట్టామన్నారు. మనస్ఫూర్తిగా రాజీనామా చేసి ఉంటే ప్రొటోకాల్ విధులకు ఎందుకు వెళ్తున్నారని ప్రశ్నించారు. ఇలాంటి వెన్నుపోటుదారులకు అమ్ముడుపోయిన వ్యక్తులను ఏమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. కొంత మంది పార్టీ కేడర్‌కు ఎమ్మెల్సీ ఫోన్లు చేస్తున్నట్టు సమాచారం ఉందని, అటువంటి వ్యక్తులను దరి చేరనీయవద్దని ద్వారంపూడి సూచించారు.

పీజీఆర్‌ఎస్‌కు 361 అర్జీలు
కాకినాడ సిటీ: ప్రతి వారం ప్రజల నుంచి అందుతున్న అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం(పీజీఆర్‌ఎస్)లో ఆయన, పలువురు జిల్లా అధికారులు ప్రజల నుంచి వివిధ సమస్యలపై మొత్తం 361 అర్జీలు స్వీకరించారు. వీటిపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి అర్జీదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదేశించారు.

కొబ్బరి తోటలో శివలింగం
పూజలు చేసిన భక్తులు




బోడపాటివారిపాలెం శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు

పి.గన్నవరం: గ్రామ శివారు బోడపాటివారిపాలెం కొండాలమ్మ ఆలయం వెనుక కొబ్బరి తోటలో సోమవారం చిన్న శివలింగం దర్శనమివ్వడంతో గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజలు చేశారు. సోమవారం ఉదయం ఆలయం వెనుక ఒక భక్తురాలికి నాగు పాము కనిపించింది. ఆమె పామును గమనిస్తున్న సమయంలో పక్కనే ఒక శివలింగం మెరుస్తూ కనిపించింది. ఈ విషయాన్ని గ్రామస్తులకు చెప్పడంతో వారు అక్కడికి వచ్చి పూజలు చేశారు. ఇది పంచలోహ శివలింగం అని ప్రజలు తెలిపారు.



బాబు గారడీ బడ్జెట్





- రాష్ట్ర బడ్జెట్‌పై మేధావి వర్గం పెదవి విరుపు
- ఏలేరు రైతులకు మొండిచెయ్యి
- అక్కచెల్లెమ్మలను వదిలేశారు
- యువత ఊసే లేదు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: కూటమి ప్రభుత్వం తొలి బడ్జెట్ జిల్లా వాసులను నిరాశపరిచింది. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించి ఉద్యోగాలు ఇస్తామని, లేకుంటే భృతి ఇస్తామని ఎన్నికల వేళ చెప్పినా బడ్జెట్‌లో ఆ ఊసే లేకుండా పోయింది. జిల్లాలో మెట్ట ప్రాంత రైతులకు వరప్రదాయిని అయిన ఏలేరు ప్రాజెక్టుకు మొండిచెయ్యే చూపారు. బడ్జెట్‌లో కనీసం రూ.100 కోట్లు కేటాయిస్తారని ఈ ప్రాంత రైతులు ఎన్నో ఆశలు పెట్టుకోగా వారికి నిరాశనే కూటమి ప్రభుత్వం మిగిల్చింది. బడ్జెట్ తీరుతెన్నులు పరిశీలించిన వారు జిల్లాకు నిధులు రాబట్టడంలో ఇక్కడి ఎమ్మెల్యేలు విఫలమయ్యారని విమర్శిస్తున్నారు.

2024–25 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌లో అన్ని వర్గాలకూ అన్యాయమే చేశారనే విమర్శ వస్తోంది. విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమం ఇలా అన్ని రంగాలకూ తీరని అన్యాయం చేశారు. ఇంత దారుణమైన బడ్జెట్‌ను తాము ఎన్నడూ చూడలేదని బడుగు బలహీన వర్గాల్లో సైతం వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కూటమి ప్రభుత్వం ఏం చేస్తుందో చెప్పకుండా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై అక్కసు వెళ్లగక్కేందుకే సమయం కేటాయించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. మొత్తమ్మీద బడ్జెట్లో చంద్రబాబు మార్కు గారడీ స్పష్టంగా కనిపించిందని మేధావి వర్గం అభిప్రాయపడుతోంది.

మహిళలకు మోసం

ఎన్నికల సమయంలో చంద్రబాబు మహిళల కోసం మహాశక్తి పథకం ప్రకటించారు. ఆయన ప్రసంగాలు నమ్మిన అక్కచెల్లెమ్మలు ఈ బడ్జెట్‌లో తమకు న్యాయం చేస్తారని ఎదురు చూశారు. అయితే బడ్జెట్ కేటాయింపుల్లో మహాశక్తి పథకం కనరాకుండా పోయింది. 19 నుంచి 59 ఏళ్లలోపు మహిళల ఖాతాల్లో ప్రతి నెలా రూ.1,500 చొప్పున జమ చేస్తామన్న బాబు బడ్జెట్‌లో ఆ ఊసే ఎత్తలేదు. ఈ ఏడాది ఇవ్వాల్సిన మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లలో రెండు ఎత్తేశారు. ఫలితంగా జిల్లాలోని సుమారు 3.24 లక్షల మంది లబ్ధిదారులు రెండు ఉచిత సిలిండర్లు పొందలేకపోయారు. కర్ణాటక, తెలంగాణల్లో అధికారం చేపట్టిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని అమలు చేయగా, ఐదు నెలలు దాటినా ఆ ప్రస్తావనే లేదని పలువురు కూటమి ప్రభుత్వ తీరును ఎండగట్టారు.

తల్లికి వం‘ధనం’ ఎక్కడ?

పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థికి ‘తల్లికి వందనం’ పేరుతో నెలకు రూ.15 వేలు ఇస్తామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 2.65 లక్షల మంది విద్యార్థులు పాఠశాలలకు వెళుతున్నారు. వీరికి గత ప్రభుత్వ హయాంలో ఏటా సుమారు రూ.234 కోట్లు అందించేవారు. ప్రస్తుత బడ్జెట్ కేటాయింపులను బట్టి చూస్తే తల్లికి వందనం పథకంలో భారీగా కోత వేశారని ఆయా వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

నిరుద్యోగులకు మరోసారి వంచన

అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు, ప్రతి నిరుద్యోగికీ నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి అందజేస్తామని హామీ ఇచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబు.. తాజా బడ్జెట్‌లో నిరుద్యోగుల ప్రస్తావనే లేకుండా చేశారు. తద్వారా తమను మరోసారి మోసం చేశారని నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉపాధి కార్యాలయం లెక్కల ప్రకారం జిల్లాలో 2.50 లక్షల మంది నిరుద్యోగులున్నారు.

ఏలేరుకు మొండిచెయ్యి


రాష్ట్ర బడ్జెట్‌లో ఏలేరు ప్రాజెక్ట్‌కు మొండిచెయ్యి చూపించడం దారుణం. ఇప్పటికే ఆధునీకరణ పనులు చేపట్టక ఈ ప్రాజెక్ట్ శిథిల స్థితికి చేరింది. ఇది పేదల బడ్జెట్ కాదు. కార్పొరేట్ల బడ్జెట్‌లా ఉంది.

– ఏగుపాటి అర్జునరావు, జిల్లా కార్యదర్శి, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్

సంక్షేమ రంగాన్ని విస్మరించారు


బడ్జెట్ అంటే గత ప్రభుత్వం హయాంలో తప్పులు వెతకడం కాదు. బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ రంగాన్ని విస్మరించింది. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు తగ్గించారు. కేటాయింపులు లేవు. ముఖ్యమంత్రిని ఆర్థిక మంత్రి పొగడడం తప్ప బడ్జెట్‌లో కొత్తదనం లేదు. అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్ల నిధులను కేంద్రం నుంచి పొందామని చెప్పి, ప్రపంచ బ్యాంకు వద్ద అప్పు అనే విషయాన్ని దాచిపెట్టారు. మొత్తం మీద బడ్జెట్ ప్రజల సంక్షేమాన్ని, రాష్ట్రాభివృద్ధిని విస్మరించింది.

– తాటిపాక మధు, సీపీఐ నేత

నిరాశాజనకం


రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ నిరాశాజనకంగా ఉంది. ముఖ్యంగా రైతాంగానికి సరిపడ నిధులను కేటాయించలేదు. రూ.2.94 లక్షల కోట్లతో ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌లో పేద, మధ్య తరగతి వర్గాలకు లబ్ధి చేకూరే విధంగా కేటాయింపులు లేవు. నిరుద్యోగ యువతకు అవకాశాలు కల్పించే ఆదాయ మార్గాలు కనిపించడం లేదు.

– కర్నాకుల వీరాంజనేయులు, ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం

హామీల అమలుపై చెప్పలేదు


ఎన్నికల హామీలను ఎప్పటి నుంచి అమలు చేస్తారో బడ్జెట్‌లో కనీసం ప్రస్తావించకపోవడం ప్రజల నమ్మకాన్ని దెబ్బ తీస్తోంది. ఈ బడ్జెట్ పూర్తి రాజకీయ పత్రంలా ఉంది. ఆదివాసులు, దళితులకు, మహిళలు, మైనార్టీల సంక్షేమానికి నామమాత్రంగా నిధులు కేటాయించడం అన్యాయం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం త్వరలో ప్రారంభిస్తామని చెప్పారే తప్ప సూపర్–6లో భాగమైన అన్నదాతా సుఖీభవ, తల్లికి వందనం వంటి పథకాలు ఎప్పటి నుంచి అమలు చేస్తారో చెప్పకపోవడం ఆయా వర్గాలకు తీవ్ర నిరాశ కలిగిస్తోంది.

– డి.క్రాంతికుమార్, సీపీఎం మండల కార్యదర్శి, పెద్దాపురం

ఉన్నత విద్యపై నిర్లక్ష్యం


కేవలం రూ.2,326 కోట్లు కేటాయించడం ద్వారా ఉన్నత విద్యను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు కొరవడిన నేపథ్యంలో ఈ కేటాయింపులు ఏమాత్రం సరిపోవు. జీతాలకు మాత్రమే సరిపోయేలా ఉంది. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు ఎంత విడుదల చేస్తారో, వసతి దీవెన బకాయిలను ఎంత ఇస్తారో, తల్లికి వందనం పథకం కింద ఎంత కేటాయిస్తారో స్పష్టత లేదు.

– ఎం.గంగా సూరిబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

చంద్రబాబును పొగడడానికే బడ్జెట్


బడ్జెట్ ఆత్మస్తుతి, పరనిందలా ఉంది. ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగంలో సీఎంను పొగడడానికే ఎక్కువ సమయం కేటాయించడం శోచనీయం. ప్రభుత్వ హామీల అమలుపై స్పష్టత కొరవడింది. నిరుద్యోగులకు ఉపాధి, నిరుద్యోగ భృతి అమలుకు చిత్తశుద్ధితో కృషి చేయాలి.

– పలివెల వీరబాబు, సీపీఎం నేత, ఇంద్రపాలెం

మరింతగా కేటాయించాలి


బడ్జెట్‌లో విద్యారంగానికి ఎక్కువగా నిధులు కేటాయిస్తే బాగుండేది. తక్కువ కేటాయింపులతో పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించలేరు. దీంతో విద్యార్థులు చదువుపై ఆసక్తి కోల్పోయే అవకాశం ఉంది.

– డాక్టర్ కె.యమున, లెక్చరర్, ఏఎస్‌డీ ప్రభుత్వ కళాశాల, కాకినాడ

తప్పనిసరిగా అపార్ ఐడీ క్రియేట్ చేయాలి
కాకినాడ సిటీ: యూడైస్ ప్లస్‌లో ప్రతి విద్యార్థి అపార్ ఐడీ, వివరాలను నిక్షిప్తం చేయాలని కలెక్టర్ షన్మోహన్ సగిలి ఆదేశించారు. ఒక విద్యార్థి, ఒక దేశం అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన యూడైస్ ప్లస్ విధానంపై వివిధ శాఖల అధికారులతో సోమవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యార్థులందరికీ తప్పనిసరిగా అపార్ ఐడీ ఉండాలన్నారు. విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లోందన్నారు. అందుకే విద్యార్థుల సమగ్ర వివరాలను సేకరిస్తోందన్నారు. కేంద్ర వెబ్‌సైట్‌లో వివరాలు నిక్షిప్తం చేయాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల అపార్ ఐడీని నమోదు చేయడంలో జాప్యం చేస్తున్నట్టు గుర్తించామన్నారు. ఈ నెల 16లోగా అపార్ ఐడీ నూరు శాతం నమోదు చేయాలని ఆదేశించారు. లేకపోతే ఆ విద్యా సంస్థల గుర్తింపును రద్దు చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో మొత్తం 3,42,298 మంది విద్యార్థులకు 2,17,535 మంది మాత్రమే అపార్ ఐడీ క్రియేట్ చేసుకున్నారని వివరించారు.

కష్టాల్లో ఉన్న కార్యకర్తలకు తోడుగా ఉంటాం

- ‘కూటమి’ వేధింపులపై అధైర్య పడొద్దు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కన్నబాబు
- పార్టీ కాకినాడ సిటీ విస్తృతస్థాయి సమావేశం
- పాల్గొన్న వంగా గీత, ద్వారంపూడి



కురసాల కన్నబాబును సత్కరిస్తున్న మాజీ ఎంపీ గీత, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి తదితరులు

కాకినాడ: అధికారాన్ని అడ్డం పెట్టుకుని వైఎస్సార్ సీపీ శ్రేణులను తప్పుడు కేసులతో భయభ్రాంతులకు గురి చేస్తున్న కూటమి ప్రభుత్వ చర్యలతో ఏ ఒక్కరూ అధైర్యపడవద్దని పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు అన్నారు. ఎన్ని కేసులు పెట్టి వేధించినా కష్టాల్లో ఉన్న ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. స్థానిక డి కన్వెన్షన్ హాలులో వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం జరిగిన పార్టీ నగర విస్తృత స్థాయి సమావేశం జరిగింది. పార్టీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కన్నబాబు మాట్లాడుతూ, వైఎస్సార్ సీపీ కేడర్‌ను నిర్వీర్యం చేయాలని అధికార పక్షం ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా అభిమానుల్లో ధైర్యం చెక్కుచెదరలేదని అన్నారు. అబద్ధాలను వాస్తవాలుగా నమ్మించేందుకు చంద్రబాబు సర్కార్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని మండిపడ్డారు. సూపర్–6 హామీలు అమలు చేయలేక, ప్రజల దృష్టిని మళ్లించేందుకే తిరుపతి లడ్డూ వివాదంతో పాటు అనేక అంశాలను తెరపైకి తీసుకొచ్చారని దుయ్యబట్టారు. తాజాగా సోషల్ మీడియా కార్యకర్తలను తప్పుడు కేసులతో వేధిస్తున్నారని విమర్శించారు. టీడీపీ దుష్ప్రచారాలతో ఏది నిజం, ఏది అబద్ధమో తెలియని పరిస్థితి సృష్టిస్తున్నారని, పార్టీ కేడర్ ఆ ట్రాప్‌లో పడవద్దని సూచించారు. కూటమి ప్రభుత్వం రోజురోజుకూ బలహీన పడుతోందని, చంద్రబాబు సిక్సర్‌కు జనం డక్కౌట్ అయ్యారని అన్నారు. కష్టకాలంలో పార్టీ కోసం పని చేసే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపుంటుందని కన్నబాబు హామీ ఇచ్చారు.

వంగా గీత మాట్లాడుతూ, పేదలకు గౌరవాన్ని, ఆత్మాభిమానాన్ని ఇచ్చి, ఎన్నో సమర్థవంతమైన పథకాలతో పరిపాలన అందించిన వైఎస్సార్ సీపీ ఓటమి చెందడాన్ని ప్రజలు ఇప్పటికీ జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. ఎన్ని భయభ్రాంతులకు గురి చేసినా అధైర్యపడొద్దని చెప్పారు. ఇలాంటి సమయంలో ప్రతి ఒక్కరూ కలసికట్టుగా ఉండి వేధింపులను ధైర్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.

ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ, దివంగత జక్కంపూడి రామ్మోహనరావు అనుచరుడిగా తాను రాజకీయాల్లో ఎదిగానని, ఏ కార్యకర్తకు కష్టం వచ్చినా అధైర్యపడవద్దని, అండగా ఉంటానని అన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా దగా చేసిన కూటమి సర్కార్ వైఫల్యాలపై వచ్చే ఏడాది మార్చి నుంచి గడప గడపకూ వెళ్లి ప్రజలకు వివరిస్తామన్నారు. ఇటీవల కొంతమంది పార్టీ శ్రేణులను వేధింపులకు గురి చేసే ప్రయత్నాలను సమర్థవంతంగా ఎదుర్కొన్నామని, ఇకపై కూడా అదే స్థాయిలో న్యాయపోరాటాలు చేస్తామని చెప్పారు. కౌడా మాజీ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి మాట్లాడుతూ, బెదిరింపులకు భయపడే తత్వం వైఎస్సార్ సీపీకి లేదని, ఎన్ని అవరోధాలు ఎదురైనా ఎదురొడ్డి పోరాడాలని పిలుపునిచ్చారు. పార్టీ నగరాధ్యక్షురాలు శివప్రసన్న ప్రవేశపెట్టిన మూడు తీర్మానాలను సమావేశం ఆమోదించింది. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షునిగా కన్నబాబును మరోసారి నియమించడంపై పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పొరుగున ఉన్న పంచాయతీలను విలీనం చేసి, కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించాలన్న సోషల్ యాక్టివిస్ట్ దూసర్లపూడి రమణరాజు ఉద్యమానికి మద్దతునిస్తూ పార్టీ తరఫున కూడా అదే తీర్మానాన్ని ఆమోదించారు. పార్టీ క్యాడర్‌పై అక్రమ కేసులను ఖండిస్తూ మరో తీర్మానాన్ని ఆమోదించారు. సమావేశంలో పార్టీ ప్రతినిధులు అబ్దుల్ బషీరుద్దీన్, అల్లి రాజబాబు, ఎండీకే కిషోర్, ఫాతిమా, వర్ధినీడి సుజాత, సిగల మధు, వాసుపల్లి కృష్ణ, సంగాని నందం తదితరులు పార్టీ కేడర్ మనోగతాలను వివరిస్తూ భవిష్యత్ కార్యాచరణపై సూచనలు ఇచ్చారు. కన్నబాబు, గీత, ద్వారంపూడిని పార్టీ శ్రేణులు ఘనంగా సత్కరించారు. రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు స్వాగతోపన్యాసం చేయగా, మత్స్యకార నాయకులు కాటాడి జానికిరామ్, సూపర్‌బజార్ మాజీ చైర్మన్ ముమ్మిడి గోవిందు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బెండా విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక దోపిడీని అరికట్టండి

- అధికార పార్టీ దళారులను అడ్డుకోండి
- భవన నిర్మాణ కార్మికుల ఆందోళన



కలెక్టర్ షణ్మోహన్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ, భవన నిర్మాణ నాయకులు



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

కాకినాడ సిటీ: ఇసుక దోపిడీని అరికట్టాలని, అధికార పార్టీ దళారులను అడ్డుకోవాలని, సంక్షేమ మండలి ద్వారా పథకాలు పునఃప్రారంభించాలనే డిమాండ్లతో భవన నిర్మాణ కార్మికులు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) ఆధ్వర్యాన ఈ ఆందోళన జరిగింది. నిర్మాణ రంగ కార్మికులకు ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, ఇసుక మాఫియాను అరికట్టాలని, ఇసుక అధిక ధరలను నియంత్రించాలని నినాదాలు చేశారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం నుంచి ప్రదర్శనగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఇసుక విధానం అధికార పార్టీల వారికే తప్ప, ప్రజలకు అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. ఇసుక దోచుకుంటున్న దళారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. యూనిట్ ఇసుకను రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకూ విక్రయిస్తున్నారని, ఆన్‌లైన్ కన్నా ఆఫ్‌లైన్ అమ్మకాలు అధికంగా జరుగుతున్నాయని అన్నారు. అధికార పార్టీల వారి దోపిడీతో ఇసుక దొరకక, భవన నిర్మాణ కార్మికులు పనులు లేక రోడ్ల పాలై, అప్పుల ఊబిలో కూరుకుపోయి, ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సొంత ఊళ్లో పనులు లేక ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన దుస్థితిని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని దుయ్యబట్టారు. ఇసుక దోపిడీదార్లను అడ్డుకోవాలని, ఇసుక స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వమే ఇసుక సరఫరా చేయాలని, అధిక ధరలు నియంత్రించాలని డిమాండ్ చేశారు. అన్ని పన్నులూ రద్దు చేస్తే భవన నిర్మాణ కార్మికులకు, సామాన్య ప్రజలకు, ఇంజినీర్లకు, బిల్డర్లకు ఇసుక అందుబాటులో ఉంటుందని చెప్పారు. నిర్మాణ రంగంలో వసూలు చేస్తున్న ఒక శాతం సెస్‌ను భవన నిర్మాణ కార్మికులకే ఖర్చు చేయాలని అన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.5 కోట్ల క్లెయిమ్ నిధులు తక్షణమే మంజూరు చేయాలని, నిర్మాణ రంగ ముడి సరకులైన సిమెంట్, స్టీల్, ప్లంబింగ్, ఎలక్ట్రికల్, టైల్స్, గ్రానైట్, కలప తదితర గృహ సామగ్రిపై అధిక ధరలను నియంత్రించాలని, 60 సంవత్సరాలు నిండిన 6 వేల మంది భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా వృద్ధాప్య పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు టి.అన్నవరం, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

ఇసుక మాఫియాకు అడ్డుకట్ట వేయాలి

ఇసుకను అధిక ధరలకు అమ్ముకుంటున్న మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని, భవన నిర్మాణ కార్మికులు, ఇతర కార్మికుల సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని, ఇసుక లభ్యత పెంచాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యాన భవన నిర్మాణ కార్మికుల సంఘం నేతలు కలెక్టర్ షణ్మోహన్‌కు కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చెక్కల రాజ్‌కుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నిట్ల శ్రీను, రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ, కొన్ని నెలలుగా ఇసుక సరఫరా నిలిచిపోవడంతో జిల్లాలో నిర్మాణ రంగంపై ఆధారపడి 53 రకాల వృత్తులు చేసుకునే 2 లక్షల మంది కార్మికులకు ఉపాధి కరువైందని అన్నారు. గోదావరి పరీవాహక ప్రాంతాల్లోని అన్ని ఇసుక రీచ్‌లను తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఉచిత ఇసుక విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. పేదల గృహ నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై బ్యాంకు రుణాలు అందించడం ద్వారా భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుకు నిధులు కేటాయిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో కూటమి నేతలు పేర్కొన్నారని, అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా ఆ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. కార్మికుల సంక్షేమ పథకాల కోసం ఉద్యమానికి సిద్ధపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యుడు నాగు తదితరులు పాల్గొన్నారు. కొత్త ఇసుక ర్యాంపుల ప్రారంభంపై రెండు రోజుల్లో ప్రకటన చేస్తామని, సంక్షేమ పథకాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకునే పనిలో ఉందని కలెక్టర్ చెప్పారని నాయకులు తెలిపారు.

రత్నగిరి.. భక్తసిరి

- సత్యదేవుని దర్శించిన 80 వేల మంది
- రికార్డు స్థాయిలో 8,358 వ్రతాల నిర్వహణ
- రూ.80 లక్షల ఆదాయం



స్వామివారి వ్రతాలాచరిస్తున్న భక్తులు

అన్నవరం : రత్నగిరి భక్తజనసంద్రంగా మారిపోయింది. కార్తిక సోమవారం, శుద్ధ దశమి, సాయంత్రం నుంచి ఏకాదశి తిథులు కలసి రావడంతో సత్యదేవుని వేలాదిగా తరలివచ్చిన భక్తులతో కిక్కిరిసిపోయింది. ఆదివారం రాత్రికే సుమారు 30 వేల మంది భక్తులు రత్నగిరికి చేరుకున్నారు. దీంతో స్వామివారి ఆలయాన్ని వేకువజామున ఒంటి గంటకు తెరచి వ్రతాలు ప్రారంభించారు. తెల్లవారుజామున రెండు గంటల నుంచి స్వామివారి దర్శనానికి భక్తులను అనుమతించారు. అప్పటి నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ రద్దీ కొనసాగింది. స్వామివారి వ్రత, నిత్య కల్యాణ, పాత కల్యాణ మండపాలన్నీ వ్రతాలాచరించే భక్తులతో నిండిపోయాయి. రికార్డు స్థాయిలో సుమారు 80 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించారని అధికారులు అంచనా వేశారు. కార్తిక మాసం ప్రారంభమయ్యాక గడచిన 11 రోజుల్లో ఇంత భారీ సంఖ్యలో భక్తులు రావడం ఇదే ప్రథమం. ఈ పవిత్ర మాసంలో సోమవారం ఒక్క రోజే అత్యధికంగా 8,358 సత్యదేవుని వ్రతాలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.80 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. ఇందులో వ్రతాల ద్వారానే సుమారు రూ.50 లక్షలు రాగా, మిగిలిన విభాగాల ద్వారా రూ. 30 లక్షలు వచ్చింది.

దీపకాంతుల్లో..

స్వామివారిని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. తూర్పు రాజగోపురం ఎదురుగా ఉన్న రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి, పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో, రావిచెట్టు వద్ద, ధ్వజస్తంభం వద్ద జ్యోతులు వెలిగించి, దీపారాధన చేశారు. దీంతో ఆలయ ప్రాంగణమంతా దీపకాంతులతో నిండిపోయింది. భక్తుల వాహనాలతో దేవస్థానం ఘాట్ రోడ్లు, మల్టీ లెవెల్ పార్కింగ్ స్థలాలు కూడా నిండిపోయాయి. పశ్చిమ రాజగోపురం లోపల రోప్ అడ్డుగా కట్టి భక్తులను నియంత్రించారు. ఇక్కడ నాలుగు వ్రత మండపాలున్నాయి. వ్రతాలు పూర్తయ్యాక ఈ మండపాల నుంచి భక్తులు ఒక్కసారిగా వెలుపలకు వస్తారు. అదే సమయంలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు కూడా వెలుపలకు వచ్చే అవకాశం ఉండడంతో చాలా రద్దీ ఉంటుంది. దీనిని రోప్ నియంత్రించారు. ఇకపై కార్తిక పౌర్ణమి, శని, ఆది, సోమవారాల్లో కూడా ఇదేవిధంగా భక్తులను నియంత్రించాలని దేవస్థానం ఈఓ కె.రామచంద్ర మోహన్ ఆదేశించారు. దేవస్థానంలో ఏర్పాట్లను ఆయన నేరుగా పర్యవేక్షించారు. సుమారు 15 వేల మంది భక్తులకు ఉచితంగా పులిహోర, దద్దోజనం, చిన్న పిల్లలకు పాలు పంపిణీ చేశారు.

క్లుప్తంగా

బైక్‌ల చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్

మామిడికుదురు: వ్యసనాలకు బానిసై బైక్‌ల దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్ట్ చేశామని నగరం ఎస్సై ఎ.చైతన్యకుమార్ సోమవారం తెలిపారు. జైలు నుంచి విడుదలై వచ్చి బైక్‌ల దొంగతనాలు చేస్తున్న అల్లవరం మండలం ఓడలరేవు గ్రామానికి చెందిన నల్లి బాలకృష్ణను అరెస్ట్ చేసి రాజోలు కోర్టుకు తరలించామని అన్నారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన బాలకృష్ణను అదుపులోకి తీసుకుని విచారించగా బైక్‌ల దొంగతనం ఘటనలు బయటపడ్డాయన్నారు. నగరం పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు, అమలాపురం టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి, పాలకొల్లు టౌన్ పరిధిలో ఒకటి చొప్పున బైక్‌లు చోరీ చేశాడన్నారు. ఆసుపత్రులు, ఖాళీ ప్రదేశాల్లో నిలిపిన వాహనాలను దొంగిలించేవాడన్నారు. రాజోలు పోలీస్ స్టేషన్‌లో 27 బైక్‌లు, అమలాపురం టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 16 బైక్‌లు దొంగతనం చేసి గతంలో జైలుకు వెళ్లి వచ్చాడని ఎస్సై చైతన్యకుమార్ వివరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చోరీ కేసులో ఇద్దరు..


విలేకర్లకు వివరాలు తెలియజేస్తున్న సీఐ కృష్ణభగవాన్

సామర్లకోట: ఇటీవల వేట్లపాలెం గ్రామంలో ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన ఇద్దరిని సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ ఎ.కృష్ణభగవాన్ వెల్లడించారు. తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్‌గా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న కోనసీమ జిల్లాకు చెందిన జిల్లెల రాకేష్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా, అదే జిల్లాకు చెందిన చావల కృష్ణ ఉన్నాడని చెప్పడంతో, ఇద్దరినీ అరెస్టు చేశామన్నారు. ఈ కేసును కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు ఛేదించామన్నారు. నిందితుల నుంచి 186.79 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వీటి విలువ సుమారు రూ.12 లక్షలు ఉంటుందన్నారు. సమావేశంలో క్రైం సీఐ అంకబాబు, ఇతర సిబ్బంది ఉన్నారు.


మురమళ్ల వీరేశ్వర ఆలయంలో స్వామివారికి పంచామృత అభిషేకం చేస్తున్న అర్చకుడు


గోదావరిలో కార్తిక దీపం వదులుతున్న మహిళ


రాజమహేంద్రవరంలో రావిచెట్టు వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ముక్కంటి... ప్రణమిల్లె జగతి

ముల్లోకాలను ఏలే ఆ ముక్కంటికి భక్తజనం ప్రణమిల్లింది.. ఓం నమఃశివాయ నామస్మరణ ప్రతి నోటా వేదమంత్రమైంది.. ఆ సర్వేశ్వరునికి ప్రీతికరమైన కార్తిక మాసం, అందులోనూ సోమవారం కావడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శైవక్షేత్రాల్లో రద్దీ నెలకొంది. ఆయా ఆలయాల వద్ద, గోదావరి ఘాట్‌లలో కార్తిక దీపాలను వెలిగిస్తూ మహిళలు కనిపించారు. అనంతరం ఆ స్వామిని దర్శించుకున్నారు. రాజమహేంద్రవరంలోని పలు ఆలయాలు, మురమళ్ల వీరేశ్వరస్వామి, పిఠాపురం, సామర్లకోటలో పంచారామ క్షేత్రాలు, ఇలా ప్రతి ఆలయంలోనూ భక్తులు కిక్కిరిశారు.


పాదగయలో కుక్కుటేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు చేస్తున్న పురోహితులు


రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో స్నానమాచరిస్తున్న భక్తజన సందోహం


మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయం బేడా మండపంలో అభిషేక పూజల్లో భక్తులు


పిఠాపురం పాదగయలో భక్తుల సందడి


పిఠాపురంలో కార్తిక దీపం చూపుతూ..

క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలి

గండేపల్లి: విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆదిత్య విద్యా సంస్థల ప్రిన్సిపాల్ ఆదిరెడ్డి రమేష్ అన్నారు. సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో సోమవారం జేఎన్‌టీయూకే సెంట్రల్ జోన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2024 పోటీలను ముఖ్య అతిథులు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ గతంలో క్రీడల్లో రాణించిన ఎందరో వివిధ రంగాల్లో మంచి స్థాయిలో స్థిరపడ్డారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందారని, ఆదిత్య క్యాంపస్‌లో పదో సారి ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జేఎన్‌టీయూకే స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ జి.శ్యామ్‌కుమార్, అంతర్జాతీయ అథ్లెటిక్స్ పీపీ వరప్రసాద్, రాష్ట్ర పీఈటీ అసోసియేషన్ నాయకుడు నూకరాజు హాజరయ్యారు. డీన్ వి.సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ రవి, ఫిజికల్ డైరెక్టర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు. సోమవారం ఉదయం జరిగిన పోటీల్లో విజేతలకు సతీష్‌రెడ్డి బహుమతులు అందజేశారు.


బెలూన్స్ వదిలి పోటీలను ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు

కాకినాడ సిటీ: పూర్వపు తూర్పు– పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయుల నియోజకవర్గ ఆంధ్రప్రదేశ్ శాసనమండలికి సభ్యుని ఎన్నికకు చర్యలు తీసుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సోమవారం తెలిపారు. అభ్యర్థులు నామినేషన్ పత్రాలను ఈ నెల 18వ తేదీ దాటకుండా సెలవు రోజుల్లో తప్ప ఏ రోజైనా, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య రిటర్నింగ్ అధికారి కలెక్టర్ కార్యాలయంలో అందించవచ్చన్నారు. దీనికి సంబంధించిన నామినేషన్ పత్రాలు కలెక్టరేట్‌లో ఉన్నాయని అన్నారు. వాటిని ఈ నెల 19న ఉదయం 11 గంటల నుంచి కోర్టు హాలు, కలెక్టరేట్ వద్ద పరిశీలిస్తారన్నారు. 21వ తేదీ మధ్యాహ్నం 3 గంటల్లోపు నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చన్నారు. ఎన్నికకు పోటీ ఉంటే డిసెంబర్ 5వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య పోలింగ్ జరుగుతుందని కలెక్టర్ వివరించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


మృతి చెందిన రాజేష్

బిక్కవోలు: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందడంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వాసంశెట్టి రవికుమార్ తెలిపారు. బలభద్రపురం గ్రామానికి చెందిన బుంగా రాజేష్ (32) గ్రాసిం ఇండస్ట్రీలో పని చేస్తున్నాడు. ఎప్పటికి లాగే ఆదివారం రాత్రి బైక్‌పై ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి 11 గంటలు అవుతున్నా అతను రాకపోవడంతో భార్య ఝాన్సీరాణి ఫోన్ చేసింది. అతను బలభద్రపురం శివారులో పడి ఉన్నాడని తెలియడంతో వెంటనే తన కుటుంబ సభ్యులతో కలిసి ఘటనా స్థలానికి వెళ్లింది. గాయాలతో ఉన్న రాజేష్‌ను అనపర్తి సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అతను మృతి చెందినట్లు ధ్రువీకరించారు. అయితే తన భర్త మృతిపై అనుమానాలు ఉన్నాయని, ఝాన్సీరాణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

లైంగిక దాడికి యత్నించిన నలుగురిపై కేసు

గోకవరం: మహిళపై లైంగిక దాడికి యత్నించిన నలుగురు యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కృష్ణునిపాలెం సంజీవయ్యనగర్‌కు చెందిన మహిళ రాజమహేంద్రవరంలో పని చేస్తుంది. ఆదివారం రాత్రి పది గంటల సమయంలో రాజమహేంద్రవరం నుంచి గోకవరం వచ్చి కాలినడకన కృష్ణునిపాలెం వెళుతుండగా పెట్రోల్ బంకు ఎదురుగా షేక్ ఖన్నానజీర్ అనే యువకుడు దీపావళి సామాన్లు కాల్చుతున్నాడు. మహిళ ఒక్కరే నడిచి వెళ్లడాన్ని గుర్తించిన యువకుడు ఆమె నోరు నొక్కి లైంగిక దాడి చేయడానికి పెట్రోల్ బంకులోకి తీసుకు వెళ్లాడు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో సమీపంలోని యువకులు అక్కడకు చేరుకుని మహిళను రక్షించారు. అలాగే యువకుడిని పట్టుకోవడానికి ప్రయత్నించగా అతని స్నేహితులు ముగ్గురు అక్కడి నుంచి తీసుకు వెళ్లిపోయారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు యువకుడితో పాటు సదరు ముగ్గురు యువకులను సోమవారం అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం రాజమహేంద్రవరం కోర్టుకు తరలించారు. వీరు నలుగురు యువకులు రాజమహేంద్రవరంలో డిగ్రీ చదువుతున్నట్టు పోలీసులు తెలిపారు.

ఆటల్లో సూపర్‌వైజర్

- రాణిస్తున్న అన్నవరం దేవస్థానం ఉద్యోగిని
- ఆలయ చైర్మన్, ఈఓ అభినందన


వల్లూరి మాధవి

అన్నవరం: సాధించాలనే తపన ఉంటే ఏదైనా సొంతం చేసుకోవచ్చు.. బాధ్యతలు ఉన్నా ఆశయాన్ని నెరవేర్చుకోవచ్చు.. అచ్చం అలానే అన్నవరం దేవస్థానం ఉద్యోగిని వల్లూరి మాధవి ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీసెస్ పోటీల్లో షాట్‌పుట్, వాలీబాల్‌లో సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. త్వరలో ఢిల్లీలో జరిగే 2024–25 జాతీయ స్థాయి సివిల్ సర్వీసెస్ పోటీల్లో పాల్గొననున్నారు. దేవదాయ శాఖ నుంచి జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన ఏకైక క్రీడాకారిణి ఆమే కావడం విశేషం. ఆ వివరాల్లోకి వెళ్తే.. విద్యార్థి దశలోనే కాదు, ఉద్యోగిని అయ్యాక కూడా ఏ క్రీడలో పాల్గొన్నా పతకాలు సాధించిన ఘనత అన్నవరం దేవస్థానం వైద్యశాల ఫార్మసీ సూపర్‌వైజర్ వల్లూరి మాధవికు దక్కుతుంది. గతంలో జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకూ ఎన్నో క్రీడల్లో పాల్గొని ఆమె పతకాలు సాధించారు. ఈ నెల 6న గుంటూరు నాగార్జున యూనివర్సిటీ మైదానంలో జరిగిన అథ్లెటిక్స్ విభాగంలో షాట్‌పుట్ (45 ప్లస్ మహిళల విభాగం)లో ప్రథమ స్థానం పొందారు. ఈ నెల 9న విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగిన వాలీబాల్ మహిళల టీమ్‌లో విజేతగా నిలిచి జాతీయ స్థాయి సివిల్ సర్వీసెస్ పోటీలకు ఎంపికయ్యారు. కాకినాడ ప్రభుత్వ బాలికల పాలిటెక్నిక్ కళాశాలలో ఫార్మసీ చదివేటప్పటి నుంచి మాధవి 1995లో దేవస్థానం ఫార్మాసిస్ట్‌గా ఉద్యోగం పొందినప్పటికీ ఉద్యోగినిగా, వివాహం అయ్యాక గృహిణిగా తన బాధ్యతలు నెరవేరుస్తూనే క్రీడా పోటీల్లో రాణిస్తున్నారు. గతంలో అనేక పోటీల్లో పాల్గొని పతకాలు సాధించినట్లు ఆమె సోమవారం విలేకర్లకు వివరించారు.


గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో షాట్‌పుట్ విసురుతున్న మాధవి

విజయ ప్రస్థానం ఇదీ..

- మాధవి విద్యార్థి దశలో సుమారు 30 సార్లు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు. ఫార్మసీ విద్యార్థినిగా వాలీబాల్ జాతీయ పోటీల్లో వరుసగా 1991లో బరంపురం, 1992లో భూపాల్, 1993లో పాట్నాలో ఆడారు.
- 2015లో కడప జిల్లా ప్రొద్దుటూరులో జరిగిన 35వ మాస్టర్ అథ్లెటిక్స్ మీట్‌లో మూడు స్వర్ణ పతకాలు, అనంతరం ఒంగోలులో జరిగిన ఎన్జీఓ క్రీడా పోటీల్లో నాలుగు పతకాలు సాధించారు.
- 2017 మార్చిలో మైసూర్‌లో జరిగిన జాతీయ స్థాయి ఎన్జీఓ క్రీడా పోటీలలో పాల్గొన్నారు. ఇంతవరకూ వివిధ పోటీల్లో పాల్గొని 60కి పైగా పతకాలు సాధించారు.
- 2018 జనవరి 7, 8, 9 తేదీల్లో గుంటూరులో జరిగిన 36వ ఏపీ మాస్టర్స్ అథ్లెటిక్ మీట్‌లో మూడు పతకాలు పొందారు. షాట్‌పుట్, జావెలిన్‌త్రోలో స్వర్ణ, డిస్క్‌త్రోలో రజత పతకాలు దక్కించుకున్నారు. జాతీయ స్థాయి సివిల్ సర్వీసెస్ పోటీలకు ఎంపికైన ఆమెను అన్నవరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్రమోహన్ అభినందించారు.

లారీల ఢీ: డ్రైవర్ మృతి

దుద్దుకూరులో ఘటన


ప్రమాదంలో మృతి చెందిన డ్రైవర్ అనంతరాజు

దేవరపల్లి: గుండుగొలను–కొవ్వూరు జాతీయ రహదారిపై దేవరపల్లి మండలం దుద్దుకూరు వద్ద సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఇందులో తెలంగాణ రాష్ట్రం భద్రాచలానికి చెందిన డ్రైవర్ సరికొండ అనంతరాజు (50) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. దుద్దుకూరు వద్ద ఫ్లైఓవర్ దిగువలో రాజమహేంద్రవరం వైపు వెళుతున్న లారీ ముందు వెళుతున్న సెప్టిక్ ట్యాంకర్‌ను ఢీకొని సర్వీసు రోడ్డులోకి దూసుకు వెళ్లింది. అక్కడ టైర్ల దుకాణం వద్ద పంక్చర్ వేయించుకోవడానికి ఆగి ఉన్న ఐషర్ పార్సిల్ లారీని ఢీకొంది. దీంతో పార్సిల్ లారీ పక్కకు ఒరిగిపోగా, దీనిని ఢీకొన్న లారీ క్యాబిన్ పూర్తిగా నుజ్జునుజ్జు కావడంతో డ్రైవర్ అనంతరాజు క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. అతన్ని బయటకు తీసేసరికి మృతి చెందినట్టు ఎస్సై వి.సుబ్రహ్మణ్యం తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోపాలపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. సెప్టిక్ ట్యాంకర్ అదుపు తప్పి పక్కకు వెళుతూ జియో ఖాళీ ట్యాంకర్‌ను ఢీకొనగా అది పాక్షికంగా దెబ్బతింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సుబ్రహ్మణ్యం వివరించారు.


దుద్దుకూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన లారీ

మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలి


కలెక్టర్ షణ్మోహన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు

కాకినాడ సిటీ: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కోరింది. సోమవారం కాకినాడలో కలెక్టర్ షణ్మోహన్‌ను కలసి వినతి పత్రం అందించిన అనంతరం వారు విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు శాశ్వత భవనాలు నిర్మించాలని అన్నారు. ప్రైవేట్ భవనాల్లో సరైన వసతులు లేక చాలా మంది విద్యార్థులు చిన్న వయసులోనే విద్యకు దూరమవుతున్నారు. అదే విధంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న హాస్టళ్లలో ఫ్యాన్లు సరిగా పనిచేయక, దోమలు దాటికి విద్యార్థులు జ్వరాల బారిన పడుతున్నారన్నారు. నీటి వసతి సరిగా లేక చాలా మంది స్నానాలు చేయడానికి ఇబ్బంది ఎదుర్కొంటున్నారన్నారు. సాయంత్రం వేళ విద్యార్థులు చదువుకోవడానికి స్టడీ హాళ్లు లేక ఆ చిన్నపాటి ప్రైవేట్ బిల్డింగ్‌లో ఇబ్బందులకు గురవుతున్నారని పీఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ప్రసన్నకుమార్‌బాబు వివరించారు.